


# కరపత్రం

SINCE 2014

బుధవారం జూలై 23 2025 సంపుటి :0 సంచిక :278 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



# రికార్డు స్థాయిలో మహిళల ఉచిత ప్రయాణం

## ఆడబిడ్డలకు సిఎం శుభాకాంక్షలు

హైదరాబాద్,జులై 22:
ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి స్కీమ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేసింది. 18 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా విజయవంతంగా సాగుతోన్న మహాలక్ష్మి స్కీమ్ అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ స్కీములో భాగంగా ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. మహాలక్ష్మి స్కీమ్ ఈ అరుదైన ఘనత అందుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 18 నెలల ప్రజా పాలనలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటి ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులైన ప్రతి ఆడబిడ్డకు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఈ పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో భాగస్వాములైన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యాజమాన్యానికి సీఎం రేవంత్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## తెలంగాణ కులగణన

# దేశానికి ఆదర్శం

### జాతీయ స్థాయిలో కులగణన తెరపైకి రావడంలో తెలంగాణదే కీ రోల్: డిప్యూటీ సీఎం భట్టి

- తెలంగాణ కులగణన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.
- బీసీలకు 42% రిజర్వేషన్లు కులగణన ఆధారంగా నిర్ణయం.
- బిల్లు రాష్ట్రపతికి పంపించారు, పార్లమెంటులో మద్దతు కోరుతున్నారు.
- రాహుల్ గాంధీ హామీ మేరకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపట్టాం.
- మొదట వ్యతిరేకించిన కేంద్రం, ఇప్పుడు కులగణన చేయాలని నిర్ణయం.
- తెలంగాణ కులగణన దేశానికి మార్గదర్శకం.
- న్యాయసవాళ్లకు సిద్ధంగా ఉన్నాం.

2లో..

హైదరాబాద్:
రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకెళ్తామని స్పష్టం చేశారు. మంగళవారం (జూలై 22) సెక్రటేరియట్లో భట్టి మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్?లో ఉందని.. ఈ బిల్లుకు పార్లమెంట్లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్లో కూడా సపోర్ట్ చేయాలని కోరారు.



## బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, భాజపా కుట్ర: కవిత

హైదరాబాద్:
బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, భాజపా కుట్ర చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభ, మండలిలో ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిందన్నారు. కానీ రిజర్వేషన్లకు మతం రంగుపులిమి రాష్ట్రపతి వద్దకు కేంద్రం ప్రభుత్వం పంపలేదని కవిత ఆరోపించారు. “రాష్ట్రంలో భాజపాకు ఓట్లు రావని తెలిసే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చలేమని మాట్లాడారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 50 శాతం పైగా రిజర్వేషన్లు అమలు చేస్తూ.. దక్షిణాదిలో న్యాయపరమైన సమస్యలు అంటూ దాటవేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు 50 సార్లు దిల్లీ వెళ్లినా.. ఈ అంశంలో ప్రధానిపై ఒత్తిడి తేలేదు. అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్తే 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ వేసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి చట్టబద్ధత కల్పించాలి” అని కవిత డిమాండ్ చేశారు.



## బిజెపిది బిసి వ్యతిరేక వైఖరి

- అందుకే రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది
- బిసిల కోసం అవసరమైతే ఎంపిలు రాజీనామా చేయాలి
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

2లో

హైదరాబాద్,జులై 22:
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అసాధ్యం అనడం బీజేపీ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిజెపి మాట్లాడుతున్న తీరు దాని బిసి వత్యిరేకతను బయటపెట్టిందన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో ఇదే విధమైన రిజర్వేషన్లు అమలు అయ్యాయి. సుప్రీంకోర్టు ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పింది రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ప్రమాణితమైన సమాచారం, ఎంపెరికల్ డేటా ఉంటే వారు రిజర్వేషన్ నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు.



2లో

## హైదరాబాద్ లో దంచికొట్టిన వాన..

## లోతట్టు ప్రాంతాలు జలమయం



2 లో

## రాజకీయం చేయొద్దు.. పార్టీలకు అతీతంగా పథకాలు

### - మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రజాప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. సిద్దిపేట కలెక్టరేట్ లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు రైతు భరోసా 6 వేల రూపాయలు ఇస్తున్నట్లు చెప్పారు.ప్రజలు ఎవ్వరు కూడా అనుకోని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా కంప్లైంట్ రాలేదని.. బియ్యం సరిగా లేవని సిద్దిపేట నుండి కంప్లైంట్ రావడంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- చేసిన పనులపై ఎప్పటికప్పుడు వివరించాలి
- పెద్ద ఎత్తున కార్యక్రమాలపై వివరించేలా ప్రచారం
- సమాచారశాఖ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్,జులై 22:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏడాదిన్నర కాలంలో ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల



హైదరాబాద్,జులై 22:
తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫలితాలు రిలీజ్ అయ్యాయి. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా సచివాలయంలో ఫలితాలను విడుదల చేశారు. జూన్ 18 నుంచి 30వ తేదీల మధ్య ఆన్‌లైన్ మోడ్‌లో పరీక్షలు జరిగాయి. టెట్ పరీక్షకు మొత్తం 1,37,429 మంది హాజరయ్యారు. కాగా, కేవలం 33.98 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 30,649 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

## హోంగార్డులకు జీతాలుచెల్లించండి

### ప్రభుత్వానికి హరీష్ రావు డిమాండ్



02

హైదరాబాద్,జులై 22 :
పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. మాటల్లో ఫేకుడు, ఢిల్లీకి వెళ్లి జోకుడు ఇదేనా సిఎం రేవంత్ రెడ్డికి తెలిసిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు విమర్శించారు. నెల మొదలై 22 రోజులు గడస్తున్నా హోంగార్డులకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటుని మండిపడ్డారు. హోంగార్డులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలోని హోంగార్డు సోదరుల ఆవేదన వినాలని సూచించారు.

## తెలంగాణ ప్రజల ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం దాశరథి: కేటీఆర్



హైదరాబాద్:
తెలంగాణ ప్రజల ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం దాశరథి కృష్ణమాచార్య అని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కవిగా, రచయితగా.. తన రచనలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన దాశరథి శతజయంతి సందర్భంగా నివాళు లర్పించారు.“నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అక్షర యుద్ధం సాగించి ధిక్కార స్వరం వినిపించిన వైతాళికుడు. రుద్రవీణ, అగ్నిధార, కవితాపుష్పకం, పునర్నవం, అమృతాభిషేకం, తిమిరంలో సమరం లాంటి సంకలనాలు, అద్భుత కావ్యాలు రచించారు. పీడిత ప్రజల గొంతుకగా జీవించిన దాశరథి తెలంగాణ ప్రజల ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం. అంతటి మహాకవిని గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం సముచితంగా గౌరవించింది. వారి పేరిట సాహితీ పురస్కారాన్ని ఏర్పాటు చేసి.. జయంతిని అధికారికంగా నిర్వహించింది. ఆ మహనీయుడి రచనలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉంది” అని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఎన్నాళ్లీ జనహననం?



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసి ప్రపంచాన్ని నివ్వెరపరిచిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గాజాలో కొనసాగిస్తున్న మారణకాండను ఆపదల్చుకోలేదని తాజా అమానుష ఉదంతం రుజువు చేస్తోంది. నిరాయుధ పౌరులనూ, మరీ ముఖ్యంగా స్త్రీలనూ, పిల్లలనూ హతమార్చటం ఇజ్రాయెల్ సైన్యానికి గత ఇరవైయ్యొక్క నెలలుగా రివాజుగా మారినా... ఆదివారం జరిగిన ఘోరం అత్యంత హేయమైనది.ఐక్యరాజ్యసమితి సంస్థ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) ఆధ్వర్యాన ఆహార పంపిణీ మొదలుపెట్టబోతుండగా పౌరు లను చుట్టుముట్టి శతఘ్నులతో, స్నైపర్లతో విరుచుకుపడి 90 మందికిపైగా పౌరుల్ని ఇజ్రాయెల్ సైన్యాలు పొట్టనబెట్టుకున్నాయి. 2023 అక్టోబర్ 7న తమ భూభాగంలోకి అడుగుపెట్టి 1,200 మంది పౌరులను కాల్చిచంపి, మరో 251 మందిని అపహరించిన మిలిటెంట్ సంస్థ హమాస్‌ను తుదముట్టించటానికి దాడులంటూ మొదట్లో చెప్పిన ఇజ్రాయెల్ ఆనాటినుంచి మారణకాండ కొనసాగిస్తూనే ఉంది.అధికారిక లెక్క ప్రకారం ఇప్పటికి 60,000 మంది పౌరులు మరణించారంటున్నా... అంతర్జాతీయ మేగజిన్ లాన్సెట్ నిరుడు జూన్‌లో ప్రకటించిన నివేదిక అది దాదాపు రెండు లక్షలంటోంది. మధ్యధరా సముద్ర తీరానవున్న గాజా స్ట్రిప్ అనే చిన్న ప్రాంతాన్ని వదిలి రావటానికి ససేమిరా అంటున్న స్థానికులను హతమార్చయినా ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ ప్రయ త్నిస్తోంది. ఆ ప్రాంతాన్ని సైతం తమ దేశంలో విలీనం చేసుకోవాలన్నది దాని ఆంతర్యం.గతంలో పాలస్తీనాపై విరుచుకుపడినప్పుడల్లా ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని 51వ అధికర ణాన్ని ఇజ్రాయెల్ ప్రస్తావించేది. సాయుధ మఠాలు దాడులకు దిగితే ఆత్మరక్షణ చేసుకునే హక్కు దేశాలకుంటుందని ఆ అధికరణ చెబుతోంది. కానీ పాలస్తీనాలో తనదికాని భూభాగాన్ని ఆక్రమించుకుని, దాన్ని విస్తరించాలనుకున్నప్పుడల్లా ఇజ్రాయెల్ ఈ అధికరణను సాకుగా చూపుతోంది.హమాస్ సంస్థ దాడుల్ని ఎవరూ సమర్థించరు. ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని చెబుతూ వారికే నష్టం కలిగించే ఆ సంస్థ చర్యల్ని మొదటినుంచీ అందరూ వ్యతిరేకి స్తున్నారు. కానీ గత 21 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ మాటేమిటి? కేవలం 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల చిన్న ప్రాంతంపై యుద్ధ విమానాలతో, బాంబులతో, క్షిపణులతో దాడులు సాగించటం ఏ అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం సబబవుతుంది? ఇజ్రాయెల్ మిత్ర దేశమన్న సాకుతో పెద్ద పెద్ద దేశాలే అది సాగిస్తున్న మారణకాండను విస్మ రిస్తున్న తరుణంలో ఇటీవల 12 చిన్న దేశాలు కొలంబియాలోని బగోటాలో అత్యవసర శిఖరాగ్ర సదస్సు నిర్వహించి కార్యాచరణకు దిగబోతున్నట్టు ప్రకటించటం ఉన్నంతలో పూరటనిచ్చే అంశం. బొలీవియా, కొలంబియా, క్యూబా, ఇండొనేసియా, ఇరాక్, లిబియా, మలేసియా, నమీ బియా, నికరాగువా, ఒమన్, సెయింట్ విన్సెంట్, దక్షిణాఫ్రికాలు వీటిలో వున్నాయి.ఈ సమావేశానికి హాజరైనా, అది విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకం చేయాలా వద్దా అన్న మీమాంసలో పడిన మరో 20 దేశాలు వచ్చే సెప్టెంబర్‌కల్లా ఏ సంగతీ తేల్చాలని సదస్సు గడువు విధించింది. ఇజ్రాయెల్‌పై దక్షిణాఫ్రికా ఇప్పటికే అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. తనదికాని ఒక ప్రాంతంపై దండెత్తి, అక్కడి పౌరులు ఎటువైపు కదలాలో హుకుం జారీ చేసే ఇజ్రాయెల్ ఆగడం నాగరిక ప్రపంచ ఉనికికే పెను సవాలు.ఇజ్రాయెల్ ఇష్టారాజ్యంగా మానవ హననానికి పాల్పడుతుంటే చూస్తూ కూర్చున్న దేశాలకు కూడా రేపన్నరోజు ఇదే గతి పట్టదన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే అంతర్జాతీయ చట్టాలకూ, ఐక్యరాజ్యసమితి చార్టర్లకూ, మానవ హక్కులకూ ఇజ్రాయెల్ పెనుముప్పుగా మారిందని 12 దేశాల సదస్సు వ్యాఖ్యానించింది.అయితే ఇజ్రాయెల్ ఏం చేసినా సమర్థించటం అలవాటైన అమెరికాను కాదని ఎన్ని దేశాలు ఈ సదస్సుతో గొంతు కలుపుతాయన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికే 'ఇంకా' సంతకం చేయని దేశాలకు దూతల్ని పంపి 'దారికి తేవాలని' అమెరికా నిర్ణయించుకుంది. ఈ సదస్సుపై ట్రంప్ కారాలూ మిరియాలూ నూరుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఉనికిలోకొచ్చిన అంతర్జాతీయ సంస్థలు మొదటినుంచీ ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నాయి. అందరికీ ఒకే న్యాయం భావన వదిలి సంపన్న దేశాలతో ఒక విధంగా, బడుగు దేశాలతో మరో రకంగా ప్రవర్తిస్తున్నాయి. అందువల్లే ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి తదితర వేదికలపై ఇప్పుడెవరికీ పెద్దగా భ్రమలు లేవు. ఉన్నంతలో కొలంబియా సదస్సు ఒక ఆశాకిరణం.ఆహార పంపిణీ కేంద్రాలు ఐక్యరాజ్యసమితి సంస్థల కనుసన్నల్లోనే వుంటున్నా అవి పాలస్తీనా ప్రజల పాలిట ఉచ్చుగా మారుతున్నాయి. ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు మాత్రమే కాదు.. చివరకు ఆహార పంపిణీ కేంద్రాలు సైతం ఇజ్రాయెల్ సైనికుల దాడులకు లక్ష్యమవుతున్నాయి. ఆకలితో నకనకలాడుతూ తిండికోసం జనం ఒకచోట గుమిగూడినప్పుడు కాల్చి చంపితే గాజాను ఖాళీ చేయించాలన్న తమ పథకం పారుతుందని ఇజ్రాయెల్ భావిస్తున్నట్టుంది.

ఒకనాడు నాజీ జర్మనీ లక్షలాదిమంది యూదుల్ని చిత్రహింసల శిబిరాలకు చేర్చి అమానుషంగా అంతమొందించింది. ఆ తరహాలోనే పాలస్తీనాలో రఫా వంటి చోట్ల శిబిరాల నిర్మాణం మొదలైంది. మరో జనహననాన్ని నాగరిక ప్రపంచం సహిస్తుందా? ప్రపంచ ప్రజానీకం మేల్కొని తమ తమ దేశాల్లోని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తే తప్ప ఇజ్రాయెల్ దురాగతాలు ఆగవు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మొదటిపేజీ తరువాయి

అయితే ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. నేడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో చెయ్యనివాటిని చేసినట్లుగా గోబెల్స్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసినదాన్ని కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతున్నామని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతోచేసినప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేకపోతున్నామని అన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టామని , 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు. ఇవేగాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపించాం. పది సంవత్సరాలలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆలోచన కూడా చేయలేదు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదు చేయలేదు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరునమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశాం. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులిచ్చాం. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదేనని ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

# రాజకీయం చేయొద్దు.. పార్టీలకు అతీతంగా పథకాలు

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల్లో హామీలు ఎన్ని ఇచ్చారో అవి అన్ని అర్హులైన వారికి వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు మంత్రి వివేక్. ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇస్తున్నామని చెప్పిన మంత్రి..1970 తర్వాత బీద ప్రజలకు ఇంత మొత్తంలో ఇండ్లు ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి తో మాట్లాడి మరిన్ని ఇందిరమ్మ ఇళ్ళు పెంచేలా ప్రయత్నిస్తామని అన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనలకు దిగారు. మాజీ సీఎం కేసీఆర్ ఫోటో చిన్నగా ఉందని.. ప్రోటోకాల్ పాటించడం లేదని ఆందోళనకు దిగారు. ఇంత మంచి కార్యక్రమాన్ని రాజకీయం చేయవద్దని సూచించారు.రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కడా లేదన్నారు మంత్రి వివేక్. రాష్ట్రంలో మొత్తం 20 లక్షల రేషన్ కార్డ్ లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని.. అర్హులందరికీ కార్డులు అందుతాయని చెప్పారు మంత్రి. అదే విధంగాఒకేసారి మొత్తం మూడు నెలల సన్న బియ్యం ఇస్తున్నామని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు 60 గజాలలో పే కట్టుకోవాలని.. 600 స్కేర్ ఫీట్ కంటే ఎక్కువగా ఉంటే బిల్లు రాదని చెప్పారు మంత్రి. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం 23 వేల కోట్ల రుణమాఫీ చేసిందని.. రైతు భరోసా 6 వేలు ఎకరాకు చొప్పున అందరికీ ఇస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రాంతానికి మంచి బియ్యం ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని.. ఇప్పుడు కార్డులు పొందే వారికి కూడా సన్న బియ్యం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇచ్చిన మూడు నెలల బియ్యంలో నూకలు వచ్చినట్లుగా కంప్లైంట్ వచ్చిందని.. భవిష్యత్తులోనైనా మంచి బియ్యం ఇవ్వాలని మంత్రి వివేక్ దృష్టికి తీసుకెళ్లారు హరీష్.

## తెలంగాణ కులగణన దేశానికి ఆదర్శం

మొదటిపేజీ తరువాయి

ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన చెప్పిన మాట ప్రకారమే రాష్ట్రంలో పవర్?లోకి రాగానే కుల గణన నిర్వహించామని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో కులగణన అంశం తెరపైకి రావడంలో తెలంగాణ రాష్ట్రానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన చేసిన తర్వాతే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొదట కులగణన వద్దని దబాయించింది కానీ తెలంగాణ సర్కార్, రాహుల్ గాంధీ ఒత్తిడికి తలొగ్గి దేశవ్యాప్త జనగణనలో కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని అందుకే తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. తెలంగాణ జరిగిన విధానమే రేపు దేశవ్యాప్తంగా అమలు కానుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేయడానికి ఇంకా చాలా సమయం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కొవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుల గణన నివేదికను కేబినెట్, శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదించామన్నారు. తెలంగాణ సర్కార్ చేసిన కులగణన దేశంలోనే చరిత్రాత్మకంగా మారిందన్నారు.

## బిజెపిది బిసి వ్యతిరేక వైఖరి

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం సర్వే చేసింది, కేబినెట్ ఆమోదం తీసుకుంది, శాసనసభ ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదంతో అది ఇప్పుడు ఢిల్లీలో ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రిజర్వేషన్ల కోసం రాజీనామా చేయాలి. నిజంగా బీసీల పక్షాన నిలబడాలని ఉంటే, రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చూపాలి. లేకపోతే బీసీల పట్ల కుట్ర చేస్తూ ఉంటారని భావించాలని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. అనాడు మండల కమిషన్‌ను వ్యతిరేకించింది బీజేపీయే. ఇప్పుడు మళ్లీ బీసీల రిజర్వేషన్లపై వక్రబుద్ధిని చూపిస్తోంది. తెలంగాణలోని అన్ని బీసీ సంఘాలు ఈ కుట్రను గమనించి రిజర్వేషన్ హక్కులను కాపాడేందుకు ముందుకు రావాలని పొన్నం పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల పక్షాన నిలుస్తున్నారు. మా పీసీసీ అధ్యక్షుడు కూడా బీసీ వర్గానికే చెందినవారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. అదే సమయంలో, బీజేపీపై విరుచుకుపడుతూ, మీరు ముఖ్యమంత్రి బీసీ అని, సిఎల్పీ నాయకుడు బీసీ అని మభ్యపెడతారు. కానీ పార్టీ అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి ఇవ్వని మీరు, మళ్లీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారు. ఇది మీ అసలు స్వరూపం అని మంత్రి ఆరోపించారు.

## తెలంగాణ గరిమను చాటిన మహానుభావుడు దాశరథి: కెసిఆర్

నా తెలంగాణ కోటి రతనాల వీణ' ... అంటూ తెలంగాణ గరిమను, తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిన గొప్ప తెలంగాణ కవి, దాశరథి కృష్ణమాచార్య అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. దాశరథి శత జయంతి సందర్భంగా వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. కవిగా, రచయితగా, తెలంగాణ అస్మితను, తన ప్రాంత ప్రజల కష్టాలను, ప్రపంచానికి వినిపించిన తెలంగాణ గర్వించదగ్గ భూమి పుత్రుడు దాశరథి అని కేసీఆర్ అన్నారు.

## హైదరాబాద్ లో దంచికొట్టిన వాన.. లోతట్టు ప్రాంతాలు జలమయం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ లో ఉన్నట్టుంది ఒక్కసారిగా వాతావరణం మారింది. మంగళవారం (జూలై 22) మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి..సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. సిటీ మొత్త మేఘలు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రానికి హైదరాబాద్ సిటీలో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మరోనాలుగు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలున్నాయని వాతావరణ శాఖ అలెర్ట్ జారీ చేసింది.మంగళవారం(జూలై 22) సాయంత్రం జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, ఖైరతాబాద్ లలో భారీ వర్షం కురిసింది. దిల్ సుఖ్ నగర్, చైతన్యపురింలో మోస్తరు వాన కురిసింది. కిషన్ పురా, హైదర్ కోట్, నార్సింగ్ ప్రాంతాల్లో కూడా వర్ష కురిసింది. ఎల్బీ నగర్ లో వాన దంచికొట్టింది. మరోవైపు శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్ లలో జోరువాన కొట్టింది. రాజేంద్ర నగర్, అత్తాపూర్, బండ్లగూడలో మోస్తరు వానపడింది.నాంపల్లి,మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్ ఏరియాల్లో కూడా వాన పడింది. మరోవైపు GHMC సౌత్, ఈస్ట్, వెస్ట్ ఏరియాల్లో భారీ వర్షాలకు కురుస్తాయని ఐఎండీ అలర్ట్ చేసింది.

## హోంగార్డులకు జీతాలుచెల్లించండి

### ప్రభుత్వానికి హరీష్ రావు డిమాండ్

మొదటిపేజీ తరువాయి

భద్రాది కొత్తగూడెం, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జగిత్యాల, వరంగల్, రామగుండం, వికారాబాద్ జిల్లాల్లో పని చేస్తున్నవారికి జీతాలు రాలేదని చెప్పారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హోంగార్డులు.. చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన దుస్థితి నెలకొందని, ఇఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరని ఆరోపించారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వీరికి ఏం సమాధానం చెబుతారు..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మంత్రిగా ఉన్న హోంశాఖలోనే ఇలాంటి దుర్భర పరిస్థితులా..? అని అడిగారు. వెంటనే హోంగార్డులకు వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దళిత యువకుడు సుబ్రమణ్యం హత్య కేసు

### – తదుపరి విచారణకు ఎస్సీఎస్టీ కోర్టు అనుమతి

వైకాపా ప్రభుత్వ హయాంలో హత్యకు గురైన దళిత యువకుడు సుబ్రమణ్యం కేసులో కదలిక వచ్చింది. అప్పట్లో ఈ హత్య సంచలనం రేపింది. వైకాపా నేత అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యకు గురయ్యాడు. ఈ కేసులో తదుపరి విచారణకు రాజమహేంద్రవరంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి ఇచ్చింది. 90 రోజుల్లో సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2022 మే 19న కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగింది. డ్రైవర్‌ను హతమార్చిన వైకాపా నేత అనంతబాబు.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. హత్య తానే చేశానని అనంతబాబు అంగీకరించారని మీడియా సమావేశంలో అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు వెల్లడించారు. అనంతబాబును రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు పంపారు. తర్వాత మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారు. తమకు న్యాయం చేయాలని.. ఈ హత్య కేసుపై సీబీఐ విచారణ జరిపి, అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటు-ంబం కోరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక బాధిత కుటు-ంబానికి పరిహారం అందజేయడంతో పాటు- న్యాయ సలహాలకు ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల సుబ్బారావును నియమించారు.

## వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలి



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల టౌన్ కరపత్రం**
జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఎస్సారెస్పీ వరద కాలువ లోకి నీరు విడుదల చేయాలని మండల రైతులు, అఖిలపక్ష నాయకులు రహదారిపైన రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నీరు లేక పంటలకు నష్టం వాటిల్లుతున్నదని, అరగంట సేపు కూర్చున్న అధికారులు స్పందించలేదని రైతులు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## జ్ఞానోదయ డిగ్రీ పీజీ కళాశాలలో గోరింటాకు సంబరాలు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్‌పల్లి పట్టణంలో జ్ఞానోదయ డిగ్రీ పీజీ కళాశాల వారి ఆధ్వర్యంలో మంగళవారం ఆషాడ మాస గోరింటాకు సంబరాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్వో నీతా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న ఆషాడ మాస గోరింటాకు సంబరాల్లో విద్యార్థినిలతో పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆషాడ మాస గోరింటాకు సంబరాలు చేసుకోవడం సంతోషకరమని అన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన తహశీల్దార్ నీత



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్‌పల్లి మండల నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి నీత గారు, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మతమార్పిడిపై మాట్లాడిన పవన్ కళ్యాణ్




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మత మార్పిడి అంశంపై డిప్యూటీ సీఎం, హీరో పవన్ కళ్యాణ్ తొలిసారిగా స్పందించారు.తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, కొన్ని కేసులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు.ఒక అమ్మాయిని విజయవాడ నుంచి కేరళకు, ఆ తర్వాత బెంగళూరుకు తీసుకెళ్లారని, చివరకు పోలీసులు ఆమెను జమ్మూలో పట్టుకోగలిగారంటూ వెల్లడించారు.ఇలాంటి పరిస్థితులు జరుగుతాయన్నారు. బహుశా ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి కేసులు ఎక్కువగా ఉండవచ్చని పేర్కొన్నారు.

## కోరుట్లలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల టౌన్ కరపత్రం**
జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కోరుట్ల పట్టణ, కోరుట్ల మండలానికి చెందిన రూ. 4, 56, 500 విలువగల 24 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందిన నిరుపేదలు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మెట్‌పల్లిలో కార్మికులకు భద్రతా ప్రమాణాల అవగాహన



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
విద్యుత్ సంస్థ లో పని చేసే ప్రతీ కార్మికుడు విధిగా భద్రతా ప్రమాణాలు పాటిస్తే తమ ప్రాణాలకు శ్రీరామ రక్ష అని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని లైన్లలో పనులు నిర్వహించాలని జగిత్యాల జిల్లా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం ఉద్బోధించారు.మెట్‌పల్లిలో మంగళవారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మల్లాపూర్, మెట్‌పల్లి రెండు సబ్ డివిజన్ల విద్యుత్ సిబ్బంది కార్మికులకు భద్రతా ప్రమాణాల గురించి అవగాహన కల్పించారు.

## పేదల పాలిట వరం – సీఎం రిలీఫ్ ఫండ్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆపత్కాలంలో పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ ఆశాజ్యోతి అవుతోందని అన్నారు. బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఐఎన్ కాలనీకి చెందిన బత్తుల మల్లారెడ్డి కుటుంబానికి రూ.50,000 చెక్కును వజ్రేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ అమ్మవారి పలారం బండి ఊరేగింపు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజవర్గం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పలారం బండి ఊరేగింపులు నిర్వహించారు. పలారం బండి కి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ విచ్చేసి పూజలు నిర్వహించారు.

## మెట్‌పల్లి క్లబ్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి – కలెక్టర్ కు వినతి



**గాజెంగి మహేశ్వర్,కరపత్రం మెటుపల్లి**
మెట్‌పల్లి క్లబ్ శాశ్వత సభ్యుల వారసులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ ని కలిసి మెట్‌పల్లి క్లబ్ అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు.కొంతమంది సిండికేట్ గా ఏర్పడి క్లబ్ ఏరియాలో ఒక గజానికి ఉన్న ధర కన్నా తక్కువ ధరకు విక్రయించినట్లు చూపించి మిగతా డబ్బును పంచుకోవడం జరిగింది.తక్షణమే ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని శాశ్వత సభ్యుల వారసులుగా కలెక్టర్ కు విజ్ఞాపన సమర్పించారు.

## యువత క్రీడల పైన దృష్టి సారించాలి




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**
యువత క్రీడల పైన దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ అన్నారు. మంగళవారం ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు ను ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ యువకులకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస అవకుండా క్రీడలపై ఆసక్తి చూపించి భవిష్యత్ లో ఉన్నత లక్ష్యలకు చేరాలన్నారు.

## కాలానుగుణ వ్యాధుల నియంత్రణపై అవగాహన ర్యాలీ.

**కరపత్రం ప్రతినిధి బాసర జులై 22**
నిర్మల్ జిల్లా :-దిలావర్ పూర్ కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత అంశాలపై మంగళవారం దిలావార్ పూర్ లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలోలో భాగంగా వర్షాకాలం కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కలిగేలా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిపిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలంతా వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తల చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉంటూ, శుభ్రతను పాటించాలని తెలిపారు.

## హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

– పోలీసు సేవలపై ఆరా తీసిన అడిషనల్ డీసీపీ భీంరావు




**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జూలై 22**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ భీంరావు మంగళవారం హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న సీజ్ వాహనాలు, దస్తావేజులు, రికార్డులు, ప్రాపర్టీ రిజిస్టర్లను పరిశీలించిన ఆయన, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడారు.పౌర సేవల నాణ్యతపై ఆరా తీసిన భీంరావు, ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనుమానితులు, రౌడీలపై నిఘా ముమ్మరం చేయాలని సూచించారు.ఈ తనిఖీలో హుజురాబాద్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్సైలు యూనస్ అహ్మద్ అలీ, డి. రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర ప్రాథమిక పాఠశాలలో ఆషాడం మాసం బోనాలు

– నా పేరే ఎల్లమ్మ సాంగ్స్ కు చిన్నారులు డాన్స్
– పోతరాజు సాంగ్స్ తో డాన్సులు ఆకట్టుకున్నారు



**కరపత్రం ప్రతినిధి బాసర జులై 22**
నిర్మల్ జిల్లా :- బాసర ప్రాథమిక పాఠశాల బాసర లో ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారికి విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు బోనమును అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇట్టి బోనాల జాతరలో విద్యార్థులు తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలకు అనుగుణంగా నృత్య ప్రదర్శన మరియు పోతరాజుల విన్యాసాలు చేస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. ఇట్టి బోనాల పండుగలో వివిధ పాఠశాల లకు చెందిన ఉపాధ్యాయులు మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అందరూ పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బడకల గంగారావు. ఉపాధ్యాయులు పి జనార్ధన్. కే శ్రీనివాస్. రాజేశ్వరి మేడం మరియు శృతి మేడం మరియు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు

## సి ఎస్ ఐ ఆర్ శాస్త్రవేత్తల దినోత్సవంలో పాలుపంచుకునే అదృష్టం అందుకున్న ఇందుర్తి విద్యార్థులు




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూలై 22**
ప్రధానమంత్రి సి ఎస్ ఐ ఆర్ అధ్యక్షుడు నరేంద్ర మోదీ తన 119వ 'మన్ కీ బాత్' ప్రసంగంలో విద్యార్థులు "ఒక రోజు శాస్త్రవేత్తగా" గడిపే అవకాశాన్ని పొందాలని సూచించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా, సి ఎస్ ఐ ఆర్ తన 'జిజ్ఞాసా' కార్యక్రమం ద్వారా జూలై 21 నుండి 25, 2025 వరకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రయోగశాలల్లో "ఒక శాస్త్రవేత్తగా ఒక రోజు" పేరుతో విశేష కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు శాస్త్రవేత్తల నిత్య జీవన విధానం, పరిశోధన పద్ధతులు, శాస్త్రీయ ఆవిష్కరణలు, ప్రాయోగిక పరిజ్ఞానం,సాంకేతిక రంగాల్లో పురోగతిపై లోతైన అవగాహన కల్పిస్తున్నారు. శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా సంభాషించే, ల్యాబ్‌లలో నేరుగా పర్యవేక్షించే అపూర్వ అవకాశం విద్యార్థులకు లభిస్తోంది.దేశవ్యాప్తంగా ఉన్న 37 సి ఎస్ ఐ ఆర్ ప్రయోగశాలలలో ప్రతిరోజూ 75-100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.ఈ క్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - ఇందుర్తి నుండి ఐదుగురు ప్రతిభావంతులైన విద్యార్థులు సి ఎస్ ఐ ఆర్ కోల్కత్తా ప్రయోగశాలకు ఎంపికయ్యారు. సాహితి, ఆశ్ర, మహవిశ్, స్వప్న, సుస్మిత, సాయి వర్షిత,ఈ విద్యార్థులు జూలై 24వ తేదీన కోల్కత్తాలోని ప్రయోగశాలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు బి. ఓదెల్ కుమార్ మాట్లాడుతూ,ఇది విద్యార్థుల కోసం ఒక అపూర్వమైన శాస్త్రీయ అనుభవం. భవిష్యత్తు విజ్ఞానవేత్తలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది,అని తెలిపారు.విద్యార్థుల ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సిహెచ్. జయప్రదం, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు వారిని హర్షభరితంగా అభినందించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జూలై 23 2025

# దారుణ హత్యకు గురైన వ్యక్తి.



**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
మెదక్ జిల్లా శివంపేట్ మండలం గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని దందు గ్రామ శివారులో బుద్ధి తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు విచారణ చేపట్టారు గుర్తుతెలియని వ్యక్తిని నగ్నంగా పడేసి రాయితో కొట్టి చంపారు మృతుడు ఎవరు ఎందుకు సంపారని కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# జాతీయ పతాక ఆమోద దినోత్సవాన్ని నిర్వహించిన లయన్స్ క్లబ్‌లు




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 22:**
జాతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా జి.సునీత, జోన్ ఛైర్‌పర్సన్, రీజియన్ 9, లయన్స్ డిస్ట్రిక్ట్ 320జీ నేతృత్వంలో భవ్య ర్యాలీ నిర్వహించారు. రామగుండం మగువ, శ్రీకారం, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్‌ల సభ్యులు జెండాను గర్వంగా ఎగురవేస్తూ, ఐక్యతతో ముందుకు నడిచారు. ఈ ర్యాలీని ముఖ్య అతిథి లయన్ మోరా భద్రేశం, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, జెండా ఊపి ప్రారంభించారు. వారు పాల్గొన్న అందరినీ అభినందిస్తూ, దేశభక్తిని ప్రేరేపించే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన లయన్ సునీతని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్‌పర్సన్ కె.రాజేందర్, జీఎంటీ కోఆర్డినేటర్ బి.రామస్వామి, మార్కెటింగ్ కోఆర్డినేటర్ శగెంటి నరేష్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సోమారపు లావణ్య పాల్గొన్నారు.

# ఏసీపీ మాధవిని పరామర్శించిన హుజురాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు





**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
హుజురాబాద్ ఏసీపీ మాధవి భర్త పోలిస్ ట్రైనింగ్ సెంటర్ డీఏస్పీ మహేష్ బాబు ఇటీవల గుండెపోటుతో మరణించగా కరీంనగర్ లోని వారి నివాసంలో మాధవి కుటుంబాన్ని పరామర్శించిన జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పోల్సనేని సత్యనారాయణ రావు వీణవంక బిఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# చలో గన్ పార్క్ కు వెళ్లకుండా బొడ్డు రవీందర్ ను అరెస్ట్ చేసిన పోలీసులు




**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
చలో గన్ పార్క్ కు వెళ్లకుండా ఉద్యమకారుడు బొడ్డు రవీందర్ ను గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బొడ్డు రవీందర్ మాట్లాడుతూ 420 హామీలిచ్చి గద్దెనెక్కిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకై తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిర్వహిస్తున్న ఛలో గన్ పార్క్ కార్యక్రమంకు వెళుతున్న తెలంగాణ ఉద్యమకారులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రతి ఉద్యమకారునికి 250 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తామన్నారనీ, ప్రతి ఉద్యమకారునికి నెలకు రూ.25 వేల పెన్షన్ తో పాటు ఉచిత బస్, రైల్వే ప్రయాణం సౌకర్యాల తో పాటు అనేక హామీలిచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న హామీలను నెరవేర్చకపోవడంపై శాంతి యుతంగా ఛలో గన్ పార్క్ కు వెళుతున్న ఉద్యమకారులను అరెస్ట్ చేయడం కంటే మీరిచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపై దృష్టి పెట్టాలన్నారు. లేకుంటే ఉద్యమకారులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా.. పేదలకు ఉచితంగా ఫంక్షన్ హాల్

– రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 22:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కింద విశ్వం ఫంక్షన్ హాల్ ను తెలంగాణ కమ్యూనిటీ భవన్ గా మార్చుతూ ఈనెల 24 నుండి పేదలకు ఉచితంగా ఇవ్వనున్నామని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రకటించారు. ఈ మేరకు గోదావరిఖని తిలక్ నగర్ లోని విశ్వం ఫంక్షన్ హాల్లో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచి, తండ్రికి తగ్గ తనయుడిగా పేరు పొందిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం ఈనెల 24న రామగుండం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా



ఉన్నకాలంలో గిఫ్ట్ ఏ స్మైల్ పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చామని, రామగుండం నియోజకవర్గంలోని వివిధ ఏరియాల్లో కేసీఆర్, కేటీఆర్ జన్మదినం రోజున పేదలకు ఐదు ఇండ్లను నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ తరహాలోనే గిఫ్ట్ ఏ స్మైల్ కింద కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 24వ తేదీ నుండి విశ్వ ఫంక్షన్ హాల్ ను తెలంగాణ కమ్యూనిటీ భవనంగా మార్చుతూ పేద ప్రజలందరికీ శుభకార్యాలకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆలాగే కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 24న రామగుండం నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. బీఆర్ఎస్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, మొక్కలను నాటే కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కింద విశ్వం ఫంక్షన్ హాల్ ను తెలంగాణ కమ్యూనిటీ భవన్ గా మార్చుతూ ముద్రించిన గోడ పోస్టర్ ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత సరోజినీ, పాముకుంట్ల భాస్కర్, గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజు,అచ్చే వేణు, నూతి తిరుపతి, జిట్టవేన ప్రశాంత్, చెలుకలపల్లి శ్రీనివాస్, మారుతి, దొమ్మేటి వాసు, బొడ్డుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్స్ తో తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్...

- సోషల్ మీడియాను దుర్వినియోగపరిస్తే చర్యలు తప్పవు
- సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా
- గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 22:**
గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలో జూన్ 29న ఒక వ్యక్తి రామగుండం జనహిత, పాలకుర్తి మండలం, నిజం నిప్పులాంటిది.. అను మూడు ఫేస్బుక్ అకౌంట్లను క్రియేట్ చేసి దానిలో మహంకాళి స్వామి మాజీ కార్పొరేటర్ ను కించపరిచే విధంగా వీడియోలను పెట్టినాడని తన దరఖాస్తు మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. పోస్టులకు సంబంధించి విచారణ చేసి టెక్నాలజీ సహాయంతో ఆ సోషల్ మీడియా గ్రూపులను క్రియేట్ చేసిన రామగుండం ఎస్టి కాలనీలో నివసించే జరుపుల శ్రీనివాస్ ని పట్టుకున్నారు. సోషల్ మీడియా గ్రూప్ క్రియేట్ చేసిన అతని ఫోను సీజ్ చేశారు. అతనిని అరెస్టు చేసి కోర్టులో ప్రొడ్యూస్ చేశారు. ఇతడు గతంలో ఆఫ్ టిప్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్వర్క్ ప్రైవేటు కంపెనీలు జాబ్ చేసేవాడు తర్వాత కొద్ది రోజులు పొలిటికల్ పార్టీలో యాక్టివ్ గా పని చేశాడు. అతని ఆరోగ్యం సరిగా లేనందున 2023 నుంచి పొలిటికల్ గా స్తబ్దతగా ఉంటూ ఇంట్లోనే సోషల్ మీడియా గ్రూపులను ఆపరేట్ చేసుకుంటూ అప్పుడప్పుడు కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. తన వ్యక్తిగత కారణాలవల్ల అనవసరమైన పోస్టులు పెడుతూ రెండు పొలిటికల్ పార్టీల మధ్య గొడవ సృష్టించి, వ్యక్తిగతన దూషణలకు ఘర్షణలకు వాగ్వాదాలకు దారితిస్తూ, ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నందున అతనిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ విద్వేషపూరిత ప్రసంగాలు ఏదైనా ఒక వర్గం వారిని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలతో పోస్టులు పెట్టటం, ఒక వ్యక్తి వర్గం రాజకీయ పార్టీ గురించి అసభ్య పదజాలం ఫోటోలు పెట్టిన, ఎవరైనా పొలిటికల్ పార్టీ వాళ్ళ కులాలకు సంబంధించి, మతాలకు సంబంధించి ఏదైనా అసభ్యకరమైన ఫోటోలు వీడియోలు మార్ఫింగ్ చేసి పెట్టిన, కించపరిచే విధంగా మాట్లాడిన, మెసేజ్లు ఫార్వర్డ్ చేసిన పెట్టిన చట్ట ప్రకారం వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మరింత కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడద్దని సోషల్ మీడియా గ్రూపులను మంచికి మాత్రమే సమాచారం చేరవేయడం కోసం మాత్రమే ఉపయోగించాలి తప్ప ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా సోషల్ మీడియా గ్రూపులను ఉపయోగించరాదని, అదేవిధంగా అసత్య సమాచారాన్ని పోస్ట్ చేసిన వ్యక్తితో పాటు ఫార్వర్డ్ చేసే వ్యక్తులపై కూడా చట్టబరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు.

# తాను మరణిస్తూ.. ఇద్దరికి వెలుగులు పంచాడు..!



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 22:**
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు, తాను మరణిస్తూ... ఇద్దరికి వెలుగులు ప్రసాదించాడు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మెటీరియల్ గేట్ సమీపంలో సుభాష్ నగర్ కు చెందిన బోయిని జశ్వంత్ (19) అనే యువకుడు, ఎన్టీపీసీలోని సోలార్ ప్లాంటులో పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఎన్టీపీసీ ఆటో నగర్ ప్రాంతంలో రాజీవ్ రహదారి రోడ్డు దాటుతుండగా, లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన చికిత్స కోసం గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. జశ్వంత్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. జశ్వంత్ నేత్రాలను దానం చేస్తే, ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులకు ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ అవగాహన కల్పించారు. బిడ్డను కోల్పోయిన దుఃఖంలో ఉన్న తల్లి లక్ష్మి, సోదరి వర్షిక, సోదరుడు వేణు స్పందించారు. జశ్వంత్ నేత్రాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు. దీంతో జశ్వంత్ నేత్రాలను ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సేకరించి హైదరాబాదుకు తరలించారు. ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించడానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, రామగుండం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పి.మల్లికార్జున్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎల్లప్ప, కార్యదర్శి సారయ్య, కోశాధికారి రాజేందర్ తదితరులు అభినందించారు. జశ్వంత్ అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

# రామగుండం ఏరియా -1లో క్వార్టర్ కౌన్సిలింగ్



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
రామగుండం రీజియన్ లో విధులు నిర్వహిస్తున్న క్యాటగిరి - 1 నుండి క్యాటగిరి - 6 ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సిలింగ్ ఆర్.సి.ఓ.ఏ క్లబ్ లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్.జి.1 యస్.ఓ.టు జిఎం ఆంజనేయ ప్రసాద్ హాజరయి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్ లో డి, టి-2, ఎం.డి, ఎస్.టి.2 టైప్ క్వార్టర్ లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వార్టర్లను అర్హత, గ్రేడ్, పదవిని బట్టి క్వార్టర్ లను ఇచ్చారు. మెత్తం 327 క్వార్టర్ లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ లో 205 మంది ఉద్యోగులు హాజరు అవగా 48 క్వార్టర్ లను ఉద్యోగులకు కేటాయించారు. క్వార్టర్ కౌన్సిలింగ్ కు అధిక సంఖ్యలో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని వారికి కేటాయించిన క్వార్టర్ల పట్ల సంతృప్తినీ వ్యక్తపరిచారు. క్వార్టర్ కౌన్సిలింగ్ ను పూర్తి పారదర్శకంగా అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, ఏరియా సెక్యురిటి అధికారి వీరారెడ్డి, సీనియర్ పిఒ హనుమంత రావు, జిదుల శ్రీనివాస్, సంక్షేమ అధికారి నిహాల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సాయి నాథ్, సెక్యూరిటీ సిబ్బంది తిరుపతి, అస్లాం పాల్గొన్నారు.